పులి బోను

చందమామకు మచ్చల్లా, గులాబికి ముళ్లులా అందమైన బొంబాయి మహానగర్గానికి మురికి పేటలూ పులిబోనులూ బాపరించాయ్. ముఖ్యంగా ఫోరస్ రోడ్డుగుండా పోతే బోనుల్లోనించి సింగారించుకున అర్థనగ్నంగా నున్న అతివలు తియ్యని వలపుపిలుపులతో మగ వారిని పలుకరిస్తారు. కడుపు కోసం హేయంగా నటించకపోతే విధిలేదని గుర్తుకు తెచ్చే దృశ్యాలివి. మనిషికీ బోనుకున్న తప్పు పట్టిన యినప గజాలకీ భేదం లేదనిపించే ఆలోచన కలుగుతుంది. నరకం మనిషి నిర్మించుకున్న స్వర్గానికి యెంతో దూరంలో లేదని అప్పుడప్పుడూ అక్కడకు వచ్చే సాంఘిక సేవకురాళ్ళు జ్ఞప్తికి తెస్తుంటారు.

శాంతి చక్కదనంతోపాటు చదువుకుంది. సొంతకారు. సంఘంలో పలుకుబడి. దాదర్ హిందూ కాలనీలో అందమైన బంగళా - అర్థం చేసుకున్న భర్త - స్త్రీ యేం కాంక్షిస్తుందో అన్నీ ఆమె పొందింది. ఇన్ని వున్నా తృప్తికోసం తహతహలాడిన ఆమె వెలుగుగా వున్న యింట్లో దీపం వెలిగించుటవలన ప్రయోజనం లేదని - కడుపునిండా వున్నవాళ్ళకి పంచభక్ష్య పరమాన్నాలతో పెట్టినా లాభంలేదని తెలుసుకొని స్వచ్ఛంద సాంఘికసేవ చెయ్యటానికి పూనుకుంది. త్యాగం వలన వచ్చిన తృప్తి ఒక వెలుగులా మనసులో ప్రవేశించి హృదయాన్ని నిర్మలం చేయసాగింది. ఉన్నత కుటుంబాలలో పాతుకపోయిన అసూయలూ, అట్టహాసాలూ, నటనలూ అన్నీ ఆమెలోనించి రానురాను తుడుచుకపోతున్నయ్. వినియోగించని చదువూ, డబ్బూ మనిషికి అరగని తిండిలా బాధ పెట్తాయని తెల్సుకుంది.

ఎర్ర అంచు తెల్లని గ్లాస్కో చీరతో ఫోరస్ రోడ్డులో తిరిగే శాంతిని చూసి చాలామంది సరసులు యేవో శృంగార వాక్యాలు విసిరారు. వాళ్ళ ఆనందానికి అర్జనకు అడ్డువస్తోందని యెందరో సువాసినులు విసుక్కొని ఆమెపై విరుచుకపడ్డారు. ఆమెను అంత దూరంలో చూసి వెటకారంగా మాటలు వినిపించేటట్లు వ్రాల్చారు. తెలిసి యే మనిషీ తప్పు చెయ్యడనే నమ్మిక శాంతికి వుంది. మానవత్వం మీద విశ్వాసం ఆమె క్షమాగుణాన్ని అధికం చేసింది. అందుకే యెన్నిసార్లు ఆమెను తూలనాడినా మళ్ళీ యీ రోజున శోభదగ్గరకు వెళ్ళింది.

"మళ్ళీ వచ్చావూ?" అని కటువుగా శోభ ఆహ్వానించింది.

"నువ్వే మళ్ళీ నన్ను రప్పించావమ్మా!"

"ఒకసారి కాదు - పదిసార్లు చెప్పాను - నా దగ్గరకు రావద్దని."

"నా చెల్లెలు రావద్దన్న మాత్రాన నా అభిమానాన్ని కాల్చుకోమంచావా?"
శోభ వెకిలిగా "అభిమానం - ఆ మాట ఒకటి వుందని నాకు తెలీదు."
"ఉందని నీ చేత ఒప్పించే అవకాశం నా కీ చెల్లీ!"
"ఎందుకమ్మా మమ్మల్ని యిలా బాధ పెట్తావు? జీవితంలో కష్టం అంటే తెలియనిదానివి మా విషయాల్లో యెందుకు జోక్యం చేసుకుంటావు?"
"మీ కష్టాలు నా కష్టాలు చేసుకుందామని - మీ బాధలు నేనూ పంచుకుందామని."
"అంతస్థులు వేరైనప్పుడు అనురాగాలెలా మొలక లెత్తుతాయ్? మమ్మల్ని సంసారులను చేసే ప్రయత్నం మాను" అంటూ శోభ ఆమె అందమైన అంగాలను నిర్లక్ష్యంగా విడిచిపెట్టింది. బయట యెవడో సరసుడు ఆతృతగా గమనిస్తున్నట్లున్నాడు. శాంతి శోభ చీరకొంగును సవరించి-
"చెయ్యిలే ననే అపనమ్మకం వుంటే యేనాడో నీ దగ్గరకు రావటం మానేసేదాన్ని. ఈ చుట్టుపట్ల వున్నవాళ్ళల్లో చాలా మంది దగ్గరకు నేనెందుకు వెళ్ళలేదు? తిన్నని బాట వదలి నువ్వెంత దూరమో రాలేదు. తిరిగి ఆ త్రోవలో పడితే ఆడదానివై పుట్టినందుకు నీ గమ్యం చేరుకుంటావు."
"ఆ నమ్మకాలన్నీ నాకేనాడో పోయాయి. జరగబోయే దానిమీద నాకు నమ్మకం లేదు. జరుగుతున్నదే నాకు కావాలి."
"చూశావా? ఎంత తెలివిగా మాటాడుతున్నావో? నీ మాటలూ రూపూచూస్తే నాకే ముచ్చటవుతోంది. నాకు స్వలాభం లేదని కాదు. నీ బ్రతుకు సవ్యం చేస్తే నా కెక్కడలేని తృప్తి వస్తుంది."
"నీ తృప్తికోసం ఒక జీవితానికి అలవాటుపడిన నన్ను యింకోరకం బ్రతుక్కు యెలా అలవాటు చేస్తావ్? నీటినించి తీసిన చేపలా అయిపోతాను. అక్కడ బ్రతకలేను ఇక్కడే నన్ను వుండనీ."
శాంతి కాస్త అధికారంగా "అదిగో చూడు - వాళ్ళంతా ఒకప్పుడు నీ కంటే అందంగా వుండేవారు. ఆడది సంసారం చక్కబెట్టుకుంటే చెట్టుకున్న పువ్వులా వుంటుంది. నలుగురు చేతులూ పడి నలిగిన పువ్వు అందవిహీనమై వేగం రాలిపోతుంది. నా వుత్సాహాన్ని చంపకు చెల్లీ!" అంది.
"ఇంతకీ నన్ను తీసుకవెళ్ళి యెక్కడ వుంచుతావు - యేం చేస్తావ్?"
"నీ తోబుట్టువనుకొని నీ వృత్తాంతమంతా నాతో చెప్పు. నీ భర్తవుంటే అతని దగ్గరకు చేరవేసి, ఒప్పించే బాధ్యత తీసుకుంటాను. నీ తల్లి దండ్రులుంటే వాళ్ళకు అప్పచెప్తాను. వీ ళ్లెవరూ లేకపోతే నీవు స్వయంగా నీ తెలివితేటలు, కాయకష్టంతో బ్రతికే యేర్పాటు చేస్తాను."
"గతం యేమీ జ్ఞాపకం లేదు. మగవాళ్ళని గౌరవించటం యేనాడో మరచిపోయాను."
"తప్పమ్మా, తప్పు. మగవాడు తండ్రిగా, భర్తగా, కుమారునిగా స్త్రీని ప్రేమిస్తాడు. అతని అభిమానాన్ని పొందిన మనం అతని చిన్న లోటుపాట్లను సవరించుకుపోవాలి. మగాడు లేకపోతే ఆడది చుక్కాని లేని నావయైపోతుంది. అందుకే నా మాట విను - నాతో రా... అన్ని యేర్పాట్లూ చేస్తాను."
"చూద్దాం - ఎవడో నా కోసం కాచుకొని వున్నాడు. ఆ ప్రేమగోల విననీ.."
ఆమె యింకేదో అనబోతుంటే వినకుండా బోను తలుపులు తెరచి-

"రండి...రండి..." అని సరసుణ్ణి ఆహ్వానించింది. వాడు లోనికి పోతూ శాంతివేపు యెగా దిగా చూసాడు.

"వెళ్ళమ్మా... వెళ్ళు – నీతో మాటాడుతూ కూర్చుంటే యెలా? నాకు పనుంది" అంటూ నిర్లక్ష్యంగా శోభ సరసునితో లోనికి వెళ్ళిపోయింది. నిశ్చేష్టురాలై నిల్చున్న శాంతికి కొద్ది క్షణాల్లో కిలకిల నవ్వులు వినిపించాయ్. ఎవరో తన పరిస్థితిని అవహేళన చేస్తున్నట్లయి అక్కడనించి తల వంచుకొని కదలి రోడ్డుమీద నడవసాగింది.

నడుస్తూనే నిస్పృహతో నిల్చుండిపోయింది. ఉగ్రుడైన ఉదయభానుడు ఆమెకు చెంపపెట్టు తగిలించాడు. కందిపోయిన కపోలములను తడుముకుంది. ఇంట్లో కాన్వెంటుకు పోయేముందు పిల్లకు ఒక ముద్దూ పెట్టకుండా, ఆఫీసుకుపోయే భర్తను కారు వరకు దిగబెట్టకుండా – ఈ ఎండలో, యీ రణగొణ ధ్వనిలో – పాపం పండిన యీ నరకంలో తనెందుకు యీ యమయాతన పడాలి? దిగజారిన శిలాప్రతిమను మళ్ళీ కొండమీదకెక్కించాలన్న ప్రయత్నం తనకు సఫలమౌతుందా? మెడవరకూ వూబిలో కోరి దిగినవాళ్ళను బైటకు లాగాలన్న ప్రయత్నంలో తనే అందులో బలవంతంగా జారిపోతే? ఈప్రదేశంలో తాగుడూ, జూదం, వ్యభిచారం అన్నీ పుష్కలం...ఈ సారా సముద్రాలు, జూదం కొంపలూ, వ్యభిచారపుగట్టులు లేని నూతులూ యివన్నీ దాటాలని తన తాపత్రయమే గానీ పొరపాటున యెక్కడ అడుగు వేసినా మళ్ళీ తన ప్రియాతి ప్రియమైన భర్తకు దూరం కావలసిందే! అలాంటిది తన కెందు కీ సాహసం? ఎవరి ఖర్మకి వారిని విడిచిపెడ్తే...!

కాస్సేపయ్యాక మళ్ళీ ఆమెకు నవ్వు వినిపించింది. ఈ నవ్వు మరెవ్వరిదో కాదు – తనదే. 'గాలికి విడిచిపెట్టినట్లు చాతకానివాళ్ళు సృష్టించిన సమస్యలను ఖర్మలకు విడిచిపెట్టేస్తారు. నాకు చదువు సంస్కారం వుందనుకుంటే అది సముద్రంలో పోసిన చక్కెర కాకూడదు. నా విశ్వాసానికి చావు యెప్పుడు వచ్చిందో ఆనాడే నేను చచ్చిపోయాను. శోభను ఆ నరకకూపంనుంచి తప్పక రక్షించగలను – పోతే అయ్యేది ఆలస్యం – కానీ!' శాంతి మళ్ళీ తిరిగి యింటికి వచ్చేసరికి బీటలువారిన విశ్వాసం అతుక్కుపోయింది.

2

శయ్యపై పవళించి యేదో ఆలోచిస్తున్న శోభకు యింటిముందు కారు ఆగిన శబ్దం వినిపించింది. శాంతి పిలవగానే విసుక్కుంటూ వచ్చి తలుపు తీసి "నన్నిలా బ్రతకనియ్యవా తల్లీ?" అని అపహాస్యం చేసింది.

"నీతి వాక్యాలు ఘోషించటానికి రాలేదు చెల్లీ! నిన్నీ చెరువునుంచి వలవేసి లాగాలనీ లేదు–

మా అమ్మాయి పుట్టినరోజు యీ వేళ. నీకో పిన్ని వుందమ్మా అని చెప్పాను. తీసుకు వస్తావా లేదా అని మారాం చేస్తోంది. ఒకసారి కారుమీద దయచేసి రాకూడదూ? మళ్ళీ వెంటనే దిగబెట్టే పూచీ నాది."

"నేనా? మీ యింటికా? ఎందుకమ్మా – గౌరవంగా బ్రతుకుతున్న వాళ్ళింటికి నాలాంటిదాన్ని."

"నువ్వు వచ్చినంత మాత్రాన మాకున్న గౌరవం మంటకలిసిపోదులే. మా అమ్మాయి భ్రాంతి తీరుతుందని ఆశతో పిలిచాను. నువ్వు రాకపోతే యిలాంటి రోజున యేడుస్తూ కూర్చుంటుంది-"

"రాక తప్పదా?"

"తప్పదు."

"అయితే నా వేషం, నేను...ఎందరు వస్తా రేమిటో?"

"స్వయంగా నా చెల్లెలులా అగపడాలని...అదిగో ఒక మంచి చీర తెచ్చాను. అభ్యంతరం లేకపోతే అది కట్టుకో చెల్లీ - నేనే నిన్ను అలంకరిస్తాను."

శాంతి కారులోనుంచి క్రొత్త టెర్రిలిన్ చీర తీసుకొని వెళ్ళింది. శోభను అలంకరిస్తూ-

"మా అమ్మాయి నీ యింటికి వస్తానని బయలుదేరింది. తెచ్చేదాననే. మళ్ళీ ఆలోచించాను. ఒకప్పటిలా నన్ను చూసి రానని నువ్వు తూలనాడితే ఆ చిన్న మనసుకు కష్టమౌతుంది. దాని అభిమానికి తగ్గట్లు నిన్ను అలంకరించి మరీ తీసుకపోదామని వచ్చాను."

ఎన్ని మాటలు చెప్పినా శోభ తిరిగి జవాబు చెప్పలేదు. కారులో పోతుండగా ఒకచోట "కొద్దిగా ఆపండి" అంది.

కారు ఆగగానే దిగి ఒక రబ్బరు బొమ్మ కొన్నది. ఆ బొమ్మకు చీరకట్టివుంది. తిరిగి కారులోనికి వచ్చి కూర్చుంది. శాంతి కారు నడుపుతూనే "మంచి బొమ్మే సెలక్టుచేశావు. నీలానే చక్కగా వుంది" అంది.

"మన మంతా బొమ్మలం కాక మరేం?" అంది శోభ.

"ప్రాణం వుండగా బొమ్మ లెలా అవుతాం...?"

"మనుషు లంతా బొమ్మలు - మట్టి బొమ్మలు - పోతే కదులుతారు - మాటడుతారు...చివరికి మట్టిగా మిగిలేది!" శోభ కాస్త వెటకారంగానే అంది.

మంచులా కరుడుగట్టిన హృదయాన్ని చల్లని వెన్నెలలాంటి మాటలు కరిగించలేవని శాంతి మళ్ళీ మాటాడక ఆలోచనలో పడింది - ఇల్లు కూడా దగ్గరపడింది.

కారు యింటిముందు ఆగగానే కూతురు పరుగెత్తుకొని వచ్చి "మమ్మీ.."అంటూ కాళ్ళు పట్టుకుంది.

"ఇదిగో ఆంటీ - గుడ్ యీవినింగ్ చెప్పావా?"

"గుడ్ యీవినింగ్ ఆంటీ!"

"గుడ్ యీవినింగ్..."

"మమ్మీ...మమ్మీ...అంకుల్ రాలేదేం?"

"దా అమ్మా...దా..." అంటూ శోభ దగ్గరకు పిల్చింది.

"అంకుల్ యెందుకు రాలేదు? ముందు చెప్పు."

"పని వుందమ్మా..." అని శాంతి అందుకోగానే...

"ఆఫీసు నించి యింకా రాలేదా?"

"హాఁ! ఆంటీ దగ్గరకు వెళ్ళు."

"మరి...అంటీకి...పాపాయిలు లేరా?"

"ఇంకా...అంటీ చిన్నదిగా...ఈ కొంటె ప్రశ్నలు వెయ్యకండా ముందు అంటీ దగ్గరకు వెళ్ళు" అంటూ ముందుకు పాపాయిని తోసింది.

శోభ బొమ్మలానే బొమ్మపట్టుకు నిల్చుంది. దగ్గరకు వచ్చిన పిల్లకు మౌనంగా అందివ్వగానే పుచ్చుకోలేదు.

"అంటీ యిచ్చింది తీసుకో అమ్మా!" అంది శాంతి...

"అంటీ హేపీ బర్త్‌డే అనలేదు - యెందుకు తీసుకుంటాను?"

"హేపీ బర్త్‌డే..." శోభ నోటి వెంబడి మెల్లగా మాటలు వచ్చాయి. పాప బొమ్మను తీసుకుని గెంతుతూ "హేపీ బర్త్ డే...యూ..యూ..యూ...హేపీబర్త్‌డే...యూ...యూ..యూ.."

"అంటీ పుట్టిన రోజు యీ వేళే కదమ్మా...?"

"అవును... యీ వేళే..." అంది శోభ.

"అమ్మ దొంగా...ముందుగా చెప్పావు కాదే?"

"మాకు ప్రతిరోజూ పుట్టినరోజే.." శోభ వెకిలిగా నవ్వింది. అంతవరకూ గదిలో కాస్తదూరంగా నిల్చొని కిటికీ గుండా శోభను శాంతిభర్త నవీన్ గమనిస్తూనే వున్నాడు. శాంతి శోభను ఇంట్లోనికి తెస్తూ "ఇదిగోండి...మా చెల్లెలని చెప్పానే - ఈమె" అంది.

"ముందుగానే పోల్చుకున్నాను."

"ఈయన మావారు."

"నమస్కారమండీ!"

"నమస్కారం."

"కాస్త తలెత్తు చెల్లీ! ఫరవాలేదు. మా వారు ఆడవాళ్ళవేపు మ్రింగివేసినట్లు చూడరులే! నువ్వు చాలా ఫ్రీగా మాటాడాలి..."

శోభ తలెత్తి ఒకసారి అతనివేపు చూసి శాంతివేపు తలత్రిప్పి చిరునవ్వు నవ్వింది.

"మా ఆయన నలుగురులాంటి మగవారుకారు. మా అమ్మ అంటుంది నేనో పువ్వు హెచ్చుపూజ చేశానని.!"

"నిజమే.." కాస్త మందస్వరంతో శోభ ఒప్పుకుంది.

వచ్చిన వారందరితో మా "కజిన్ సిస్టర్" అని శోభను పరిచయం చేసింది. ఈ వేళ ఆమె సింగారింపుతో శాంతికి మించిపోయినట్టుంది. శాంతిది కాస్త పలుచని కోలముఖం - సన్నని పెదాలు - సంస్కారంతో వెలుగుతున్న కళ్లు - మధ్యగా తీర్చిదిద్దిన ముక్కు - సొగసు పుట్టిపడుతున్న శరీరచ్ఛాయతో తేలికైన శరీరం. శోభది కోమలమైన మేలిమి బంగారుచాయ శరీరం - గుండ్రని ముఖంలో కాస్త పెదాలు బొద్దుగావున్నా మిగతా అవయవాలు పుష్టిగా పెరిగివున్నాయ్. చూపుల్లో కళ్ళెంవేసి లాగుకొనే తత్వం కనిపిస్తుంది. టీ పార్టీలో శాంతి శోభను తన ప్రక్కనే కూర్చోబెట్టుకుంది. చాలా మంది యేకపత్నీవ్రతులకళ్ళు శోభ సొగసుమీద పడ్డాయి గానీ ఆమె కళ్ళు యెవరిమీదా పడలేదు. కళ్ళాలు తెగిన గుర్రంలా ఆమె కదలసాగింది.

శాంతి ఆమె ప్రవర్తనను చూసీ చూడనట్లు పరిశీలిస్తూనే వుంది. ఇదివరకు తీరని కోరికలతో యింకొకటి చేర్చుకుని కొందరు, పెరిగిన అసూయపై యింకోముద్ద చేర్చి మరికొందరూ, లోని అసంతృప్తిని బయటకు తృప్తిగా నటిస్తూ వేరొక్కరూ... యిలా రకరకాల అనుభూతులూ, అనుమానాలూ, ఆవేశాలూ, అసంతృప్తీ...నటనలతో వచ్చినవారు వెళ్ళిపోయారు; మిగిలింది శోభ!

"ఈ రాత్రి యిక్కడ వుండకూడదూ?" నవీన్ చొరవచేసుకు శోభను అడిగాడు.

"అబ్బే...యెందుకండీ...వచ్చినపని అయ్యిందిగా...వెళ్తాను."

"మా యింట్లో వారంరోజు లుంటే మీ బావగారి సొత్తు తరిగిపోదులే."

"తిరిగిపోతుందని కాదు. ఇక్కడ నే నుండటం మీకు మంచిది కాదు."

"మా మంచి చెడ్డలు మాకు తెలీవా? ఆయన యెవర్నీ వుండమని అడగరు - నోరు విప్పి ఆయన అడిగినందుకు - యీ రాత్రికి వుండరాదూ?"

"నా పని యింకేం వుంది చెప్పండి? దయచేసి నన్ను వెళ్ళనివ్వండి."

"ఒక్క రాత్రికి వుండమంటే యింత మురిపిస్తున్నా వప్పుడే - యిప్పుడే నువ్వు పారిపోకుండా తలుపులు బిడాయిస్తున్నా" అంటూ శాంతి ముంగిటి తలుపులు వేసింది.

మాటాడకుండా శోభ చిన్న నవ్వుతో అంగీకారాన్ని తెలియపర్చింది.

పాపకూ శోభకూ సన్నిహితం యేర్పడింది. ఆంటీదగ్గర ఆ రాత్రి పడుకోడానికి ఒప్పుకుంది. పాపకు వచ్చిన ఇంగ్లీషు పాటలన్నీ పాడింది. నాలుగు చినుకులు రాలితే...

"రైన్ రైన్ గో ఎవే
కమ్ ఎగైన్ అనదర్ డే
లిటిల్ సుజాత వాంట్స్ టు ప్లే" అని ఆంటీతో ఆడుకోడం మొదలెట్టింది. వర్షం కూడా వెలిసింది. కొద్దిగంటల పరిచయంతో ఆ ముద్దులొలికే పాపను వదలటానికి మనస్కరించలేదు.

అన్యోన్యంగా మేడమీద పోర్టికోలో మసక వెన్నెల్లో మాటాడుకుంటున్న భార్యా భర్తలను చూసింది. కమ్మగా మెల్లని వీణా వాయిద్యం రేడియోనుంచి వినిపిస్తోంది. ఇవన్నీ చూస్తూ గాలికి మెల్లగా కదులుతున్న ఆకులా శోభ హృదయం అల్లల్లాడసాగింది.

భోజనాలదగ్గర యెంతో వుత్సాహంగా వుండాలని యిద్దరూ శోభను ప్రత్యేక అతిథిలా చూసి గౌరవించారు. పాపకు అప్పుడే నిద్దర తూలిపోతోంది. జోకొట్టడానికి మేడమీదకు వెళ్ళిపోతూ శాంతి భర్తకు యేదో సైగ చేసింది.

భోజనాలయ్యాక అక్కడ సోఫాలో నవీన్ చారబడి "రండి కూర్చోం"డని యెదురుసోఫా చూపించి టేబిలు మీద పళ్ళేరంలోని ద్రాక్షపళ్ళను చూపించాడు. ఆమె సంశయిస్తుంటే "మీరు కూర్చోపోతే...నేనూ నిల్చుంటాను" అనగానే ఆమె మాటాడకండా కూర్చుంది. "అలా సంశయిస్తే యెలా? మేం మిమ్మల్ని మా యింట్లో మనిషిగా చూసుకునేటప్పుడు మీరుకూడా అలా మెదలాలా వద్దా చెప్పండి - మీరు తింటేగానీ నేనూ తినను" అన్నాడు.

ఆమె ఒకసారి తలెత్తి అతని వేపు చూసింది. నవీన్ చిన్న నవ్వుతో "మా

అవిడకు మీరంటే గొప్ప పిచ్చి. బహుశః మీ యింటికి వచ్చేటప్పుడు బాగా మర్యాద చేసివుంటారు."

"తూలనాడాను."

"నేను నమ్మను – ఆమె మాటను వినలేదేమో? మరి నా మాటనూ తృణీకరిస్తారా?" నవీన్ వేసిన యీ సూటి ప్రశ్నతో ఆమె అతనివేపు అమాయకంగా చూసింది. ఆమెకు తొలిసారిగా మగవాని యెదుట సిగ్గు కప్పుకొని వచ్చింది.

"ముందు ఆ మాట యేదో విననీయండి."

"అవిడ చెప్పిందే నేనూ చెప్తాను."

శోభ మౌనం దాల్చగానే నవీన్ ప్రాధేయపూర్వకంగా అన్నాడు – "ఊఁ అంటే రేపే... చెంబూరులో ప్రొటెక్టివ్ హోమ్ వుంది. అందులో చేర్పిస్తాను. మీ బాగోగుల బాధ్యత మాకు అప్పజెప్పండి. "

"సరే...రేప్రొద్దున్న చెప్తాలెండి" అంటూ మెల్లగా మేడ యెక్కుతూ మెట్లమీద ఆగింది. శాంతి పాడుతున్న జోలపాట వినిపిస్తోంది. నవీన్ ఆగిన ఆమె వేపు నిదానంగా చూస్తున్నాడు. ఆడది కాంక్షించేవి రెండూ రెండుప్రక్కల చేరువలో వున్నవనిపించిం దామెకు.

మరుక్షణంలో అంతా కలగని లేచినట్లయింది. అటు పాపమీద, యిటు నవీన్ మీద హక్కు తనకు లేదు. హక్కుగలది శాంతి. ఎంత రాత్రివరకో నిద్దర రాలేదు. ఆ గదిలోవున్న ఫారిన్ మేగజీన్లు తిరగవేసింది.

చక్కని పుష్టిగానున్న పిల్లల బొమ్మలు, భార్యభర్తలు అన్యోన్యంగా అందంగా అన్నీ అమర్చిన యిళ్ళల్లో తిరగాడుతున్న ఫొటోలు – ఆడది చక్కగా తయారవడానికీ, గృహం తీర్చిదిద్దడానికీ, రుచికరమైన వంటకాలు తయారు చేసి యింటంతా ఒకచోటకూడి తృప్తిగా ఆరగించటానికీ – ఇలా ఆడాళ్ళు కాంక్షించేవన్నీ ఆ మేగజీన్లలో అగుపించాయి. కోరికలు, కళ్లాలు లాగిన గుర్రాల్లా పరుగెత్తుతున్నట్లు; దీపం ఆర్పి పరుపుమీద చేరబడగానే అనిపించింది. తన నిజ పరిస్థితి వూహించగానే కళ్లెం తెగిపోయింది. సుఖానికీ ఐశ్వర్యానికీ అంతంలేదు. కష్టాలకీ దరిద్రానికీ అవమానం తెలియదు. అంత తెలుసుకోలేని సుఖాలకై అవమానం తెలియని తను యెందుకు ప్రాకులాడటం?

మళ్ళీ తన పాతచోటుకే పోతే బాగు అనిపించింది. ఆలస్యంగా నిద్రపోవటం వలన వేగం తెలివి రాలేదు. తను లేచేసరికి పాప స్నానంచేసి బట్టలు వేసుకొని కాన్వెంటుకు పోవడానికి సిద్ధంగా వుంది. శోభ లేవగానే పాపదగ్గరికొచ్చింది.

"ఆంటీ...ఆంటీ...నీ కోసమే చూస్తున్నా."

"ఏమమ్మా..."

"చిన్న ముద్దుపెట్టూ –" అంటూ బుగ్గ చూపించింది.

పాచినోటితో ముద్దు పెట్టటానికి మనస్కరించలేదు. "ఓ నిమిషం తల్లీ!" అంటూ గబగబ పళ్ళు తోముకొని ముఖం కడుక్కొని జుత్తు సవరించుకొని వచ్చి ముద్దుపెట్టింది. ఆ ముద్దువలన కలిగిన స్పర్శవలన అదేదో అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. పాప వెంటనే కారు దగ్గరకు వెళ్ళగానే–

"ఆంటీ! అమ్మకంటే నువ్వే నయం" అంది.

"ఏం అమ్మా."

"కాన్వెంటుకు పోయేటప్పుడు - టాటా...అనటానికి అమ్మ వుంటేనా... అంటీ టా...టా..."

"టా...టా...!" కారు కదలగానే అక్కడే నిల్చుండిపోయింది. కళ్ళల్లో కన్నీరు తిరిగిపోయింది. ఎన్నాళ్ళకి కళ్ళల్లో కన్నీళ్ళు స్వతహాగా కార్చగలిగింది? చల్లని స్వచ్ఛమైన కన్నీరు?

తనూ అలా చిన్నపిల్లలా కాన్వెంటుకు పోవాలనీ, చదువుకాగానే పెళ్లి చేసుకొని సంసారాన్నీ, పిల్లలనీ, యింటినీ చక్కబెట్టుకోవాలనీ...ఏవేవో క్షణికమైన వెర్రివూహాలు కలిగాయ్. తన జీవితం యింతవరకూ తలా తోక లేని కథ - యిహనైన కథ రక్తికట్టిస్తే...?

☆ ☆ ☆

"ఒక వారంరోజులు వున్నాక వెళ్తే బాగుంటుందేమో?" అన్నాడు నవీన్.

"ఒద్దు. మీరెవరూ రాకండి, నేనే వెళ్తాను" అంది శోభ.

ఐనా శాంతి మూడురోజులుపోయాక కారులో చెంబూరు ప్రొటెక్టివ్ హోమ్‌కు తీసుకవెళ్ళి దిగబెట్టింది.

3

శాంతి దిగబెట్టిన వారంనాడే శోభ తిరిగొచ్చేసింది. "ఎంతపని చేశావ్? వాళ్ళతో కయ్యంకూడా తెచ్చుకున్నావా?"

"అవును మరీ - అంతా మిలటరీ డిసిప్లిన్. సినీమాకు తీసుక వెళ్ళారు; ఒక వరసగా నడిచివెళ్ళాలి. మా మీద వెటకారంగా యెందరికళ్ళో! ఎక్కడికీ వెళ్ళటానికీ, పైవాళ్ళెవరితోనూ మాటాడటానికి వీల్లేదు. నానాచాకిరీ - మా బట్టలు మేమే వుతుక్కోవాలి - వంటవార్పులు చేసిందికాక చదువూ, సంధ్యా, అల్లికలూ, కుట్టుపనులు - ఒళ్ళు హూణం హూణం అయిపోతుంటే - మధ్యను యెగతాళి చెయ్యటానికి ఒక మగపురుగైనా వుంటేనా?"

"మగవాళ్ళను యెగతాళెందుకు చెయ్యాలీ?"

"ఏమో...నాకు వాళ్ళని చూస్తే అలానే అనిపిస్తుంది."

"సరే...ఇప్పుడేం చెయ్యాలని?"

"మళ్ళీ నా మొదటిచోటుకే పోతాను."

"మళ్ళీ ఆ పులి బోనులోనికా-?"

"చెంబూరు హోమ్ బోనులా కనిపించకపోయినా అందులో బ్రతుకుబోనుల్లో నున్న ఆడపులుల బ్రతుకులే మా అందరివీను. నాలా యెందరో యిదివరకే తప్పించుకపోయారు."

"తొందరపడి యెంత పొరపాటు చేశావు చెల్లీ!"

"పొరపాటు - నీ కలానే వుంటుంది? పాపను చూడాలని వెళ్ళిన దగ్గరనించీ మనసే! పర్మిషన్ అడిగితే వెటకారంగా విసుర్లు. మీ కెందుకమ్మా యింత శ్రమ? ఓసారి పాపనుచూసి పోనివ్వండి."

"నిన్ను మళ్ళీ ఆ పాపం నిండిన బోనులోనికి వెళ్ళనివ్వను."

"పైకి బోనుల్లా కనిపించినా అక్కడున్న స్వతంత్రం యెక్కడా లేదక్కా! నా యిష్టం వచ్చినట్లు వుండేదాన్ని. ఒకరు మారాం చేస్తారనిగానీ అనుమానిస్తారని గానీ, తిట్టారనిగానీ, యేమనుకుంటారనిగానీ, ఏంటో గాలిలో యెగిరేపిట్టలా మనస్సెప్పుడూ నువ్వన్న ఆ బోనులోనే వుల్లాసంగా వుండేది. ఈ వారం రోజులూ నేను నిజంగా జైలుశిక్ష అనవసరంగా అనుభవించాను అనిపిస్తోంది."

"సరే – ముందు స్నానం చేసి, బట్టలు మార్చు" అంటూ శాంతి తన చీర నొకటి యిచ్చింది.

భర్త రాగానే జరిగిన సంగతి చెప్పింది.

"అయితే యేం చేద్దాం?" అన్నాడు.

"మళ్ళీ అక్కడికి వెళ్ళే అవకాశం యిస్తే – ఈ కృషి అంతా వృధా – ఒక పని చేద్దామా? పాపకు యీామె అంటే ప్రాణం. పెరటియింట్లో వుంటుంది. ఇల్లు చూసుకుంటుంది. అడగనా?"

"నీ యిష్టం."

శాంతి అడగ్గానే "ఎందు కక్కా నీకీ శ్రమ?" అంది శోభ.

"పాపను చూసుకొనివుంటావ్. దానికి నువ్వంటే ప్రాణం – ఇంకో విధంగా నీకు అభ్యంతరం లేకపోతే.. .."

"అభ్యంతరం అంతా ఒక్క విషయంలోనే..."

"ఏంటది?"

"నీకు తెలుసు – నాలాంటివాళ్ళను మీ యింట్లో వుంచుకోవటం మీకు అపవాదులు తెస్తాయి."

"నాకులేని అనుమానం నీకెందుకు?"

"పాపమీద మమకారమే నన్ను మీ యింట్లో వుండనిస్తోంది. అయితే ఒక్కహామీ యిస్తావా?"

"ఏంటి చెప్పు?"

"అనుమానం మీద నన్నెప్పుడూ బయటకు పంపవా?"

"పిచ్చిపిల్లా – నాకు యెవరిమీదా అనుమానాలు లేవు."

"మీ ఆయన మీదో?"

"ఏం, బావగారిమీద పట్టించావ్?"

"మగాళ్ళను నీలా నమ్మే ఆడదాన్ని యెక్కడా చూడలేదు."

"ఇంట్లో వుంటావుగా – నా నమ్మికలో నిజం నువ్వే తెలుసుకుంటావులే."

శోభ నవ్వింది. శాంతి కాస్త హుందాతో–

"మనిషి ఒక అంతస్థు చేరుకున్నాక అవినీతికి పాల్పడలేదు. అలా వున్నతమైన అంతస్థుకు మీ బావగారు చేరుకున్నారని యింకా పోల్చుకోలేదా?" అంది.

"నేను కాదన్నానా? ఆయన మహానుభావుడు."

"ఇప్పటికైనా పోల్చుకున్నందుకు సంతోషం."

"అఖరికి జయించా వక్కా"

"నిన్ను మళ్ళీ ఆ పులిబోనుకు పంపిస్తానా?"

" ఆ పట్టింపే వద్దు. నీకు కోపం రాదని యెలా అనుకోమంటావ్?"

"నీ విషయంలో యెప్పుడూ రాదు."

"నీ కంటే నాది పైచెయ్యి అయితే?"

"సంతోషిస్తాను."

"ఆడదానికి అసూయ లేదంటే నేనొప్పుకోనక్కా!"

"ఈ యింట్లోనుంచి యిలాంటి అసూయలూ, అనుమానాలూ యేనాడో పంపించి వేసాం."

"నేను తిరిగి తెచ్చానేమో?"

"తెచ్చినా అవి తిరిగిపోతాయ్. నిన్నో మనిషిని చేస్తాయ్."

"నేను మనిషినికానా యిప్పుడు?"

"దీపాల ప్రకాశంలో తేడా లున్నాట్లే మనుషుల్లోనూ వుంటాయ్. పెద్దలంటారు చూడు – దేదీప్యమానంగా ప్రకాశించాడని."

"అంత ప్రకాశం వద్దుబాబో – యెవరూ చూడలేరు."

"ఒక్కసారి మెరుపులా ప్రకాశించవద్దు – రానురాను...ప్రకాశిస్తేనే... అందం."

"నీ దగ్గర చాలా నేర్చుకున్నానక్కా! బావగారుకూడా నీలానే నేర్పిస్తారేమో?"

"నేర్చుకో – నేర్చుకున్నది యేనాడో సహాయపడ్తుంది."

మాటలు యింకా పొడిగించేదే. పాప స్కూల్‌నించి వచ్చి రావటంతోనే–

"ఆంటీ" అంటూ మీదకు వచ్చింది.

శోభ పాపను తీసుకొని చిన్నముద్దు పెట్టగానే "ఆంటీ...ఆంటీ...ఎక్కడికి వెళ్ళిపోయావ్? నేను నీ కోసం యేడ్చాను" అంది.

శోభ కళ్ళు తుడుచుకొని "నీ యేడుపు విని వచ్చేశానుగా!" అంది.

"మళ్ళీ యెప్పుడూ వెళ్ళవుకదూ? నా దగ్గరే వుంటావుకదూ?"

"హుఁ..."

శాంతి "టా టా..." అంటూ వెళ్ళిపోయింది. అమ్మ వేపు చూస్తూ "ఆంటీ... ఆంటీ... అమ్మ సరిగ్గా యింట్లోనే వుండదు!" అంది.

"ఎక్కడకు వెళ్తుంది?"

"అమ్మ నాలా స్కూలుకి వెళ్తుందట!"

"ఎవరన్నారు?"

"నాన్నారు."

"మరి నాన్నగారో?"

"ఆఫీసుకు."

"కాదు."

"మరెక్కడికి?"

"స్కూలుకి."

"నిజం?"

"నిజంగా-"

"నేను స్కూలుకి - నాన్నారు స్కూలుకి- మరి అమ్మ స్కూలుకి... అందరికీ చదువే...నువ్వూ వెళ్తావా?"

"నే రాను. నాకు వచ్చిన చదువు చాలు. నిన్ను చూసుకొని వుంటా - పద" అంటూ లోనికి తీసుకవెళ్ళింది. బట్టలు మార్చి స్నానం చేయించి గౌను వేసి దగ్గరగావుండి బిస్కట్లు, పాలు యిచ్చింది. ఇద్దరూ పెరటి చిన్న గార్డెన్‌లో రింగుతో ఆడుకుంటుండగా నవీన్ దిగబడ్డాడు. ఒక్కసారి కోరి ఓడిపోయిన శోభకు వినిపించేట్లు చప్పట్లు కొట్టాడు.

"వెల్ డన్ పాపా...వెల్ డన్."

"గుడ్ యీవినింగ్ డాడీ!" అంటూ కాస్సే పయ్యాక పాప దగ్గరకు వచ్చింది. నవీన్ అంతవరకు శోభ విప్పారిన యౌవనపు బిగువుతో ఒళ్ళంతా త్రిప్పుతూ ఆడుతుంటే చూస్తున్నాడు. శోభకూడా దగ్గరకు వచ్చింది. చెమట పట్టిన శరీరాన్ని చీర చెంగుతో తుడుచుకుంటుంటే-

"చాలా బాగా ఆడుతున్నావే" అన్నాడు.

"అబ్బే - నాకు రాదండీ. పాప బలవంతం."

"మరి కాస్సేపు ఆడరాదూ?"

"మీకు టీ..."

"తొందరలేదు"

"మీరు టీ త్రాగాక...కావలిస్తే."

"అయితే వేగం..."

పాప కబుర్లు చెప్తుండగా నవీన్‌కు టీ, బిస్కట్లు శోభ పెట్టింది. రెండే బిస్కట్లు నమిలి టీ త్రాగి తనే ఆటకు తయారయ్యాడు. పాప ఒకవేపు నవీన్ యింకో వేపు. ఆటపై దృష్టిలేని నవీన్ ఓడిపోగానే పాప "డాడీ...షేమ్...షేమ్" అంది.

"మీ యిద్దరూ ఆడండి. నేను అంపైర్‌గా వుంటాను."

వాళ్ళ ఆట వుధృతంగా సాగుతోంది.

నవీస్ స్కోరు తడబడుతోంది. శోభ శృంగారమంతా ఒలకబోస్తోంది. గాలి వీచింది. చెట్టుకున్న కొమ్మలు కదలి చేతికందేటట్లు వంగుతున్నాయి. పర్వత శిఖరాలు, మేఘాలను చీల్చుకుంటూ నింగివేపు చొచ్చుకొనిపోతున్నయ్. అనంతమైన ఆకాశంలో మేఘాలు ఢీ కొంటున్నాయ్. నవీన్ నరాలు తోడుకుంటున్నాయ్.

గెలిచినపాప ఒక్కసారి పరుగెత్తి అంటే మెడను చుట్టేసుకుంది.

"రా - అమ్మా-రా" అంటూ నవీన్ దగ్గరకు వెళ్ళి పిల్చాడు. పాపను అందుకుంటూ శోభ చేతిని తాకాడు. ఆమె చెయ్యి చప్పున లాక్కుంది. అతనోసారి ఆమె కళ్ళల్లోనికి చూడాలన్న ప్రయత్నం ఫలించలేదు. మేఘాలు వర్షించకుండా అరుస్తున్నాయ్.

వర్షం ముంచుకొని వచ్చేసరికి నవీన్ చెమట చల్లారింది. శాంతి దగ్గరగా కూర్చోగానే మనసు మరోవేపు త్రిప్పటానికి ప్రయత్నించాడు. ఐనా కళ్ళల్లో పొత్తుకున్న

ప్రతిబింబాలు యింకా మనోవికారాన్ని పూర్తిగా మాపివేయలేదు. అరుణోదమయ్యేసరికి మళ్ళీ ఆవేశం పెనవేసుకుంది.

శాంతి వుదయమే వెళ్ళగానే తను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళాడు. ఎదురుగా నున్న కుసుమాన్ని గగనకుసుమంగా, అందమైన సౌధాన్ని ఆకాశహర్మ్యంగా వూహించలేకపోయాడు.

అందుబాటులోనున్న వస్తువును విడచిపెట్టే ఋషిపుంగవుడు కాడతడు. తన కోరిక బలీయమైనకొద్దీ శోభ దూరమౌతోంది. ఆమె గత చరిత్రను తెలుసుకున్న తను యిదంతా నటన అని నిర్ధారించుకున్నాడు. ఆమె ఒక సుఖం తప్పించి తనకు కావలసిన అన్ని సుఖాలను యింట్లోవుండి అందజేస్తోంది. రాను రాను ఆమె యింట్లో యిల్లాలైనట్లు భ్రమించినట్లు చేస్తోంది. తన భార్యయైనా తనమీదా, పిల్లమీదా అంత శ్రద్ధ తీసుకోలేదు. ఈమె యీ యింటికి క్రొత్త అనురాగం అందం వెలుగు తీసుకవచ్చింది. పురుగులుపట్టి ఆకులన్నీ రాల్చిన మొక్క కొన్నాళ్ళకు క్రొత్త చిగుళ్ళను తొడిగినట్లుగావుంది. తొడిగిన మొగ్గలను పూలగుత్తులుగా మార్చి సువాసనలను వెదజల్లే రాత్రులు ఆసన్నమయ్యాయ్.

తోటలో నైట్ క్వీన్ వాసనకు ఒకసారి పాము దరిచేరి యేదో శబ్దం కాగా తొంగిచూచి వెళ్ళిపోయింది. ఇంకోసారి రాలిన పూలపైనుంచి కదలిపోయింది. పసిడి వెన్నెలలో పూలగుత్తుల గుభాళింపులు అధికమై మత్తెక్కించి మనస్సును అదుపులో లేకుండా చేస్తున్నాయ్.

ఒకనాటి రాత్రి శాంతి అన్నది–

"శోభ యేమీ చెప్పదు – పెళ్ళి చేస్తానంటే నా కెందుకని నవ్వుతుంది."

"నీ కెందుకా వూహ పుట్టింది? అయినా యిప్పుడు దానికి తక్కువేం వచ్చింది?"అన్నాడు నవీన్.

"తక్కువని కాదు...మీరొకసారి అడిగితే మంచిదేమో?"

"సరే – భోజనాల దగ్గరడుగుతాను."

ఆ మరుసటి రోజు భోజనాల దగ్గర "చూడు శోభా...మీ అక్క నీకు పెళ్ళి చెయ్యాలని పట్టుబడ్తోంది!"

"ఎవరి నిచ్చి?"

"మంచి మగవాడ్నిచ్చి!"

"అయితే నా కష్టాలు యింకెవరికీ రావు."

"చెల్లీ! చాల మంచివాడు. నెలకు నూరుపైనే తెచ్చుకుంటున్నాడు కాదనకు."

"మీ చేతులతోనే నా పెళ్ళి చేస్తారు?"

"అవును–"

"నేను మీ కే మౌతానని చెప్తారు? ఎక్కడ దొరకానని చెప్తారు?"

"అవేవీ చెప్పం."

"అయితే పెళ్ళయాక నన్ను రోజూ నా గత చరిత్ర తెలుసుకోవాలని చంపుకతింటాడు."

"అదంతా చెప్పకు."

"ఊరుకుంటాడా? లేనిపోని అనుమానాలు పెట్టుకుంటాడు. చెప్పకపోతే కోపగించుకుంటాడు. ఇంకా వూరుకుంటే కొట్తాడు. అనుమానం రాను రాను పెరిగిపోతుంది. నేనో కులటనని నా పీక తెగేసి తనూ బలవంతంగా పోలీసులను తప్పించుకోవాలని చస్తాడు."

"అంత మంచివాడు అలా చేస్తాడంటే నమ్మను."

"శ్రీరామచంద్రుడు చెడ్డవాడాక్కా?"

జవాబు చెప్పని శాంతితో "పరపురుషుణ్ణి కలలోనైనా తలంచని సీతమ్మ తల్లిని అగ్నిపరీక్ష చేసింది కాకుండా అడవిపాలు చేసేసాడు. దేముడంతటివాడే ఆడదానికి దుస్థితి పట్టిస్తే...నాలాంటిదానికి పెళ్ళెందుకు?"

"అవన్నీ కథలు - ఎంతకాలం ఒంటరిగా వుంటావు?"

"పాప వుందిగా...?"

"అదీ పెద్దదయి అత్తవారింటికి వెళ్ళిపోతే...?"

"ఆరోజు సంగతి చూసుకుందాం."

"అలాంటి పాప పుట్టాలని మనసు కలగలేదూ?"

శోభ నవ్వేసింది.

"నా మాట విను చెల్లీ! ఇంతకంటే మంచి అవకాశం దొరకదు - ఎంత శ్రమపడి యీ సంబంధం తెచ్చానో ఆలోచించావా?"

"క్షమించు అక్కా! ఏ విషయంలో నీకు పూర్తి విశ్వాసం వుందో ఆ విషయంలో నాకు విశ్వాసం లేనేలేదు."

"పిచ్చిదానిలా అవుతావెందుకని" శాంతి విసుక్కోగానే-

"నీకా - నాకా - అక్కా?" శోభ నవ్వింది.

"నీకు...నీకు...నీకు..." గట్టిగా అంటూ అక్కడినించి చిరాగ్గా కదలిపోయింది.

బయటికి పోయిన భార్యను చూసి నవీన్ శోభవేపు చొరవ చేసుకొని చూశాడు. ఆమె కళ్ళు తొలిసారి అతని కళ్ళల్లోకి నిదానించి చూశాయ్. కళ్ళద్వారా మనసులు మాటాడుకున్నాయ్. మనోభావాలు హృదయస్పందనలై వినిపించి రక్తం పొంగి ప్రవహించింది.

నవీన్ దగ్గరగా వచ్చాడు. అతని చేయి ఆమె భుజాన్ని తాకింది. ఆమె కూర్చునే తలెత్తి దరహాసం చేసింది. అతను నవ్వుతూ ముఖం వంచాడు. పెదాలలో పవ్వళించిన ప్రేమ మేల్కొంది.

"నా శోభా..." అన్నాడు.

ఆమె మనస్ఫూర్తిగా నవ్వింది. అతని చేతిని తన చేతుల్లోకి తీసుకొని నొక్కింది.

"ఎన్నాళ్ళకు నీ దయ కల్గింది..." నవీన్ ప్రేమపగ్గాలను లాగాడు.

"ఇన్నాళ్ళు నటించాను...ఇంక నటించలేను. మీ సుఖాన్ని కాదనలేను."

అతని ఆవేశం మాటలను మ్రింగేసింది. కళ్ళను చిల్లులను చేసింది. ఆమెను కుర్చీమీదనుంచి చేతులతో లేవనెత్తాడు. దొరికిన పుష్పాన్ని నలపకుండా వదిలే అమాయకుడు కాడు. ఆమె కిలకిల నవ్వుతూ అంతవరకూ నిశ్చేష్టురాలై వాకిలి తలుపుదగ్గర నిల్చున్న శాంతి వేపు చూపిస్తూ "అదిగో...అక్క" అంది.

నవీన్ మొదట వినిపించుకోలేదు. శోభ అతనిముఖం పట్టుకు ఆమెవేపు త్రిప్పగానే శోభను క్రిందకు దించాడు.

"రా..అక్కా..రా..." అంది శోభ.

చల్లబడిన పాదాలు మెల్లగా వేసుకుంటూ శాంతి ఆమె దగ్గరకు వచ్చి ఒక్కసారి కఠినంగా–

"నా యింట్లో నాగుపాముని పాలిచ్చి పెంచానని అనుకోలేదు. ఫో...నా యింట్లోనించి – ఫో..." అంది.

శోభ నవ్వుతూ "పోడానికే వచ్చా నక్కా! ఇప్పటికైనా నీ విశ్వాసం పోయిందా?" అంది.

"వెళ్ళు...తిన్నగా వెళ్ళు."

"నాకోసం యింత శ్రమ తీసుకున్నావు కదా, నీకు అన్యాయం చేస్తానా?"

"ఇంకేం చెయ్యాలి?"

"బావగారి శీలాన్ని చెరపలేదులే అక్కా! ఇంకా ఆయన యేకపత్నీవ్రతుడే. నాదంతా నటనే!"

"నటన!...ఫో"

"వెళ్ళిపోక, వుండిపోతానా? నీవు ఒక్కమగాడితో పడుతున్నావు– అందుకే నీకు అతని శీలంమీద అంత విశ్వాసం. కానీ నేను వందలాది మగాళ్ళని చూశాను. వాళ్ళ ప్రేమగోల వినలేక విసిగిపోయాను. బావగారిలాంటి కొమ్ములు తిరిగిన మగాళ్ళు కొంగు తగిలితే పోలేమంటారు. ఇల్లాలు అదుపులో పెట్టినన్నాళ్ళు మగాడు మృగం కాదు. ఇన్నాళ్ళూ యీ పులిబోనులో పెట్టి ఆదరించినందుకు కృతజ్ఞురాలను – వస్తాను – టా – టా."

శాంతి ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడవనారంభించింది.

(యువ, ఫిబ్రవరి *1964*)

* * *